

రాజేందర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

## పట్నం రాజేందర్‌రెడ్డి ఆశయసాధనకు కృషి చేయాలి

చేవెళ్లటౌన్, మార్చి 1: దివంగత పట్నం రాజేందర్‌రెడ్డి ఆశయసాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య తెలిపారు. శుక్రవారం దివంగత రాజేందర్‌రెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని చేవెళ్ల మండల కేంద్రంలోని ఆయన విగ్రహానికి చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, మాజీ ఎంపీపీ మంగళి బాల్‌రాజ్, పార్టీ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌తో కలిసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజల సంక్షేమం కోసం నిరంతం పోరాటం చేసిన నాయకుడు రాజేందర్‌రెడ్డి అని తెలిపారు. కార్యక్రమంలో పామెన ఎంపీటీసీ సత్యనారాయణచారి, చేవెళ్ల మార్కెట్ కమిటీ డైరెక్టర్ తెలుగు వెంకటేశ్, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ యాదగిరి, నాయకులు, రవి, ఎల్లయ్య, సత్తయ్య, రాముప్రసాద్, చందు, గోపాల్‌రెడ్డి, గ్రామస్తులు ఉన్నారు.

## రేషన్ బియ్యం క్రయవిక్రయాలు జరిపితే చర్యలు



రైస్ మిల్లును తనిఖీ చేస్తున్న డీటీ రఘునందన్

ఆమనగల్లు, మార్చి 1: రేషన్ బియ్యం క్రయవిక్రయాలు జరిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా పౌర సరఫరా శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ మాచన రఘునందన్ అన్నారు. శుక్రవారం మాడ్గుల్ మండల పరిధిలోని ఇర్విన్ గ్రామంలోని రైస్ మిల్లును ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ధాన్యం నిల్వలు, రికార్డులను పరిశీలించి మాట్లాడారు. రేషన్ బియ్యంతో వ్యాపారం చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైస్ మిల్లర్లు గుట్టుచప్పుడు కాకుండా రేషన్ బియ్యం కొని, వాటిని నూకలు మార్చి వ్యాపారం చేస్తున్నారని పేర్కొన్నారు. రేషన్ బియ్యంతో దందా కొనసాగించే రైస్ మిల్లులను సీజ్ చేసి, యజమానులపై పీడీ యాక్టు ప్రకారం కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

## వక్ఫ్ బోర్డు ఆస్తులను పరిరక్షించాలి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మజీద్ కమిటీ సభ్యులు

ఆమనగల్లు, మార్చి 1: వక్ఫ్ బోర్డుకు సంబంధించిన ఆస్తులను పరిరక్షించాలని జామా మజీద్ కమిటీ సభ్యులు ప్రభుత్వాన్ని కోరారు. ఆమనగల్లు పట్టణంలో ఆక్రమణకు గురవుతున్న వక్ఫ్ బోర్డు భూములను కాపాడాలని కోరుతూ, శుక్రవారం మజీద్ కమిటీ సభ్యులు తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని సర్వే నంబర్ 1లో వక్ఫ్ బోర్డుకు సంబంధించిన విలువైన భూములు ఉన్నాయని తెలిపారు. కొందరు వ్యక్తులు సదరు భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపట్టారని పేర్కొన్నారు. అక్రమ నిర్మాణాలపై గతంలో అధికారులకు ఫిర్యాదు చేయడం జరిగిందని వారు గుర్తు చేశారు. వినతిపత్రం అందించిన వారిలో మజీద్ కమిటీల అధ్యక్షులు గౌస్‌మైనుద్దీన్, ఖాదర్ ఖాద్రీ, ఎంఏ ఖలీల్, నూరోద్దీన్, చోటే బేగ్, చాంద్‌పాషా, రజాక్, అబ్దుల్, జబ్బార్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నేతల ఆరోపణలు సరికాదు

మంచాల పీఏసీఎస్ చైర్మన్ పుల్లారెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

మంచాల, మార్చి 1: రాజకీయ దురుద్దేశంతోనే తనపై కాంగ్రెస్ పార్టీకి చెందిన నేతలు కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఎవరెన్ని ఎత్తులు తనపై వేసినా పూర్తి కాలం చైర్మన్‌గా కొనసాగుతానని పీఏసీఎస్ చైర్మన్ పుల్లారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మంచాల మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎంపీపీ నర్మద, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చీరాల రమేశ్ కలిసి మాట్లాడుతూ.. మంచాల ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం ఎన్నికల్లో గెలిచిన సహచర మెజార్టీ డైరెక్టర్ల మద్దతుతో గత నాలుగేండ్లుగా తాను చైర్మన్‌గా పదవిలో కొనసాగుతున్నానని చెప్పారు. రైతుల అభ్యున్నతి కోసం సహకారం అందిస్తున్నానని తెలిపారు. తాను ఎలాంటి అవినీతి అక్రమాలకు పాల్పడలేదని, కొందరు కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు, డైరెక్టర్లు తనపై లేనిపోని ఆరోపణలు చేయడమే పనిగా పెట్టుకున్నారని అన్నారు. సహకార సంఘం నూతన భవన నిర్మాణం, దాన్యం కొనుగోలు విషయంలో ఎలాంటి అవినీతి అక్రమాలు జరుగకున్నా కొందరు డైరెక్టర్లు కావాలని తనపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే విచారణకు ఆదేశించినట్లు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే రాజకీయ ఒత్తిడితో తనపై డిస్‌క్వాలీఫై ఉత్తర్వులు తీసుకువచ్చారని తెలిపారు. ఈ ఉత్తర్వులపై తాను హైకోర్టును ఆశ్రయించి స్టే పొంది తనపదవిని తిరిగి పొందడం జరిగిందన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా రైతుల మద్దతుతో తాను పదవిలో కొనసాగుతానని స్పష్టం చేశారు. కాంగ్రెస్ నాయకులు తనపై ఆరోపణలు చేసినా తాను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నానని చెప్పారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు చిందం రఘుపతి, రాము, రావుల శంకర్, రాంరెడ్డి, కృష్ణ, జంగారెడ్డి, రాము పాల్గొన్నారు.

## పశువుల యజమానులు జాగ్రత్తలు పాటించాలి



కొత్తూరు, మార్చి 1: తగు జాగ్రత్తలు తీసుకుంటే పశువులకు వ్యాధులు సోకకుండా ఉంటాయని మండల పశువైద్యాధికారి డా. స్ఫూర్తి అన్నారు. మండలంలోని కొత్తూరు, ఇన్ముల్‌నర్వ, కుమ్మరిగూడ గ్రామాల్లో పశువులకు శుక్రవారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా మండల పశువైద్యాధికారి స్ఫూర్తి మాట్లాడుతూ పశువులకు సీజనల్‌గా వ్యాధులు వస్తుంటాయని చెప్పారు. అందువల్ల పశువుల యజమానులు జాగ్రత్తగా పశువులను కాపాడుకోవాలన్నారు. మొత్తం 248 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశామని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది మల్లయ్య, కృష్ణ, రవి, శ్రీలత, రాజు, రైతులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ క్రీడల నిర్వహణకు కృషి

షాబాద్‌లో దివంగత నేత రాజేందర్‌రెడ్డి వర్ధంతి కార్యక్రమంలో ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి

జిల్లాస్థాయి క్రీడాపోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేత

పాల్గొన్న జడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి




రాజేందర్‌రెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి

షాబాద్, మార్చి 1: షాబాద్‌లో అంతర్జాతీయ క్రీడలు నిర్వహించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం షాబాద్ మండల కేంద్రంలోని పీఆర్ఆర్ స్టేడియంలో దివంగత నేత పట్నం రాజేందర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డితో కలిసి రాజేందర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారం రోజులుగా నిర్వహించిన జిల్లా స్థాయి క్రీడాపోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. క్రికెట్‌లో మొదటి బహుమతి చందనవెల్లి కేపీఆర్ జట్టుకు రూ.75వేల నగదు, జ్ఞాపిక, ద్వితీయ బహుమతి హైదరాబాద్ మస్కతి జట్టుకు రూ.50వేల నగదు, జ్ఞాపిక, వాలీబాల్‌లో మొదటి బహుమతి అంతారం జట్టుకు రూ.25వేల నగదు, జ్ఞాపిక, ద్వితీయ బహుమతి కుమ్మరిగూడ జట్టుకు రూ.15వేలు, మెమోంటోలు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ... శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు సమీపంలో ఉన్న ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. చేవెళ్ల గడ్డపై రాజకీయ చైతన్యం తీసుకువచ్చిన ఘనత దివంగత రాజేందర్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఆయన కలలను నిజం చేయాలనే ఉద్దేశంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. షాబాద్ మండలంలోని పలు గ్రామాల్లో తన నిధులతో పాటు జిల్లా పరిషత్ నిధులు తీసుకువచ్చి అభివృద్ధి పనులు చేపడుతామన్నారు. స్టేడియంలో ఉన్న రాళ్ల గుట్టను తొలగించడానికి నిధులు కావాలని అడిగారని, తప్పనిసరిగా నిధులు అందిస్తామని చెప్పారు. వచ్చే ఏడాది నుంచి మహిళలకు కూడా క్రీడలు నిర్వహిస్తామని, తాండూరులో 17వ అంతర్జాతీయ క్రీడలు పెట్టడంతో దేశమంతట నుంచి మహిళలు, బాలికలు వచ్చి క్రీడల్లో పాల్గొన్నారని, ఇక్కడ కూడా అవకాశం ఉంటే అలాంటి క్రీడాపోటీలు నిర్వహిస్తామని తెలిపారు. జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి మాట్లాడుతూ రాజకీయాల్లో మార్పు తీసుకువచ్చి గ్రామాలను అభివృద్ధి చేసిన రాజేందర్‌రెడ్డి పేరు చిరస్థాయిలో నిలిచిపోతుందని చెప్పారు. జిల్లా పరిషత్ నుంచి షాబాద్ మండలానికి అత్యధికంగా నిధులు ఇచ్చినట్లు తెలిపారు. కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. షాబాద్ మండలానికి ఒక గుర్తింపు తెచ్చిన నాయకుడు రాజేందర్‌రెడ్డి అని చెప్పారు. గతంలో ఏ గ్రామానికి కూడా రోడ్డు, విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో ప్రజల ఇబ్బందులను గుర్తించి దగ్గరుండి అధికారులతో మాట్లాడి రోడ్లు, విద్యుత్ సదుపాయం కల్పించారని గుర్తు చేశారు. మాజీ మంత్రి కేటీఆర్ నాయకత్వంలో చందనవెల్లి, సీతారాంపూర్ గ్రామాల్లో ఇంటర్నేషనల్ కంపెనీలు తీసుకురావడంతో నాడు లక్షల్లో ఉన్న భూములు ధరలు నేడు కోట్లలోకి వెళ్లిపోయాయన్నారు. జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి మాట్లాడుతూ.. క్రీడాపోటీలతో గ్రామాల మధ్య స్నేహ సంబంధాలు ఏర్పడుతాయని తెలిపారు. తన తండ్రి దివంగత రాజేందర్‌రెడ్డి పేరుపై ప్రతి ఏడాది జిల్లా స్థాయి క్రీడా పోటీలు నిర్వహించి క్రీడాకారులను ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పీఆర్ఆర్ స్టేడియం చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, వైస్ చైర్మన్ మల్లారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు గూడూరు నర్సింగ్‌రావు, శ్రీరాంరెడ్డి, మొయినాబాద్ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, సహకార సంఘం చైర్మన్ చల్లా శేఖర్‌రెడ్డి, క్రీడల నిర్వాహకులు మహేశ్‌యాదవ్, రమేశ్‌యాదవ్, ధనుంజయ్, మాజీ జడ్పీటీసీలు కోట్ల మహేందర్‌రెడ్డి, రాజేందర్‌గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు శేరిగూడెం వెంకటయ్య, శ్రీనివాస్‌గౌడ్, పి.నర్సింహారెడ్డి, మండల కో-ఆప్షన్ సభ్యుడు ఎండీ చాంద్‌పాషా, బీఆర్ఎస్ నాయకులు కొలన్ ప్రభాకర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, పి.ప్రభాకర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, వెంకట్‌యాదవ్, విష్ణువర్దన్‌రెడ్డి, నర్సింహారెడ్డి, కమ్మరి శ్రీను, ముక్రంఖాన్, ఇమ్రాన్, రాంచంద్రారెడ్డి, వెంకట్‌రెడ్డి, అవిలాశ్‌గౌడ్, రాంచందర్, భూపాల్‌రెడ్డి, ఆయా గ్రామాల మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, యువకులు పాల్గొన్నారు.

# దేవాలయ భూమిని కాపాడండి

తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసిన గ్రామస్తులు

మంచాల, మార్చి 1 : దేవాలయ భూమిని కాజేయడానికి కొందరు వ్యక్తులు చూస్తున్నారని, ఆ భూమిని కాపాడాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపై ఉందని ఎంపీటీసీ కావలి శ్రీనివాస్ అన్నారు. మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో ఉన్న వేణుగోపాల స్వామి(శ్రీరామ చంద్రమూర్తి) దేవాలయ భూమిని గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కాజేయాలని చూస్తున్నాడని, ఆ భూమిని కాపాడాలంటూ శుక్రవారం మంచాల తహసీల్దార్‌కు కార్యాలయం ఎదుట నిరసన తెలిపి అనంతరం తహసీల్దార్ ప్రసాద్‌రావుకు మాజీ సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి, గ్రామస్తులతో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కావలి శ్రీనివాస్, విష్ణువర్దన్‌రెడ్డి మాట్లాడుతూ శ్రీరామ చంద్రమూర్తికి చెందిన భూమి పాత సర్వే నెంబర్ 711బై1, 711 బై2లో మొత్తం విస్తీర్ణం 12.12ఎకరాల భూమి ఉంది. ప్రస్తుత సర్వే నంబర్ 1581, 82 నంబర్‌లో ఈ భూమిని రామచంద్ర స్వామి పేరుమీద ఉన్న భూమిని గుడి పూజారి అయిన రామచంద్రాచారి పేరుమీద కొంత మంది రెవెన్యూ అధికారులు పూజారులు కలిసి ఇట్టి భూమిపై పట్టాదారు పాస్‌పుస్తకాలు సృష్టించారని ఆరోపించారు. శ్రీరామ చంద్ర స్వామి భూమి దాతలు, తండ్రుల నుంచి దేవాలయం పేరుపైనే ఉందని కొందరు గ్రామానికి చెందిన వ్యక్తులు దేవాలయ భూమిని కాజేయాలని దొంగదారిన పట్టాపాస్ పుస్తకాలు సృష్టించారని ఆరోపించారు. దేవాలయ భూమిని కాపాడాలంటూ కలెక్టర్, తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేసినట్లు చెప్పారు. వెంటనే స్పందించిన అధికారులు దేవాలయ భూమిని రక్షిస్తామంటూ గ్రామస్తులకు హామీ ఇచ్చారు. వినతిపత్రం అందజేసిన వారిలో గ్రామస్తులు చంద్రయ్య, జంగయ్యగౌడ్, యాదయ్య, భాస్కర్, మధు, జంగయ్య, రమాకాంత్‌రెడ్డి ఉన్నారు.



దేవాలయ భూమిని రక్షించాలంటూ తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఆరుట్ల గ్రామస్తులు



# విద్యార్థులకు సాగు పాఠాలు

వ్యవసాయ క్షేత్రంలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఆదర్శరైతు నాగరత్నం నాయుడు

పెద్దఅంబర్‌పేట, మార్చి 1: విద్యార్థులు వ్యవసాయంపై అవగాహన కలిగి ఉండాలని ఆదర్శ రైతు నాగరత్నం నాయుడు అన్నారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన కాలేజీల విద్యార్థులు అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తారామతిపేటలోని నాగరత్నం నాయుడు వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు. అక్కడ సాగు చేస్తున్న పంటలు, పెంచుతున్న భిన్నమైన రకరకాల మొక్కలను ఆసక్తిగా పరిశీలించారు. ఈ సందర్భంగా నాగరత్నం నాయుడు మాట్లాడుతూ.. సేంద్రియ సాగుతో ఎలాంటి లాభాలు ఉన్నాయి, రైతులకు ఎలాంటి సహకారం అందాలి, రైతులుగా యువత రావాలంటే ఎలాంటి అంశాలపై ఆసక్తి పెంచుకోవాలో సూచనలు చేశారు.

# సేంద్రియ సాగుపై రైతులు దృష్టి పెట్టాలి

వ్యవసాయ సహాయ సంచాలకులు దివ్యజ్యోతి, రేష్మారాజ్



మొయినాబాద్, మార్చి 1: సేంద్రియ పద్ధతిలో పంటలు సాగు చేసి అధిక దిగుబడులు సాధించాలని రాజేంద్రనగర్ వ్యవసాయ సహాయ సంచాలకులు దివ్యజ్యోతి, రేష్మారాజ్ అన్నారు. మండల పరిధిలోని కేతిరెడ్డిపల్లి మొయినాబాద్ రైతు వేదికల్లో రైతులకు సేంద్రియ ఎరువులు, జీవన రసాయన మందులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రసాయన ఎరువులు, రసాయన మందులు వాడటం వలన ప్రజలు అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని చెప్పారు. కావునా రైతులు వర్మికంపోస్టు ఎరువులు తయారు చేసి సేంద్రియ పద్ధతిలో పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. సేంద్రియ ఎరువుల ద్వారా పంటలు పండించడం వలన తక్కువ పట్టుబడితో పాటు అధిక దిగుబడులు సాధించడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాగమ్మ, ఏఈవోలు కుమార్, సునీల్, రైతులు పాల్గొన్నారు.

## ఇబ్రహీంపట్నం సీఐగా సత్యనారాయణ

ఇబ్రహీంపట్నం, మార్చి 1: ఇబ్రహీంపట్నం సీఐగా సత్యనారాయణ నియమితులయ్యారు. పహడిషరీఫ్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఆయన ఇబ్రహీంపట్నంకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన సైదిరెడ్డి సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు.





రైల్వేగేట్ సమీపంలోని మురుగుకుంట

## దుర్వాసన భరించలేం..

షాద్‌నగర్‌టౌన్, మార్చి 1 : నివాసాల ముందున్న మురుగుకుంటతో భరించలేని దుర్వాసన వస్తుందని స్థానికులు వాపోతున్నారు. పట్టణంలోని చటాన్‌పల్లి రైల్వేగేట్ సమీపంలో ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న మురుగునీరంతా ఒకే దగ్గర చేరి మురుగుకుంటలా మారిందని, దీంతో భరించలేని దుర్వాసన రావడంతో పాటు దోమలు, ఈగలు అధికమై రాత్రి సమయాల్లో నిద్రలేమికి గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దిగువ ప్రాంతానికి మురుగునీరు వెళ్లేలా అంతర్గత మురుగుకాలువ ఏర్పాటు చేసినప్పటికీ అంతర్గత మురుగుకాలువ ధ్వంసమై మురుగునీరు పారుతుందని చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## ఒకటో తేదీనే పింఛన్ ఇవ్వాలి

జిల్లా అడిషనల్ డీఆర్‌డీవోకు దివ్యాంగుల వినతి



సూర్యారావును సన్మానిస్తున్న దివ్యాంగులు

యాచారం, మార్చి1: జిల్లా అడిషనల్ డీఆర్‌డీవోగా బాధ్యతలు చేపట్టిన సూర్యారావును శుక్రవారం వీహెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాళ్ల జంగయ్య ఆధ్వర్యంలో దివ్యాంగులు కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సన్మానించారు. జిల్లాలోని ఆసరా పింఛన్లు, దివ్యాంగుల సమస్యలపై ఆయనతో మాట్లాడారు. దివ్యాంగులకు ప్రతి నెలా ఒకటో తేదీన పింఛన్ అందేలా చూడాలని జిల్లా ఆసరా పింఛన్ అధికారి సూర్యనారాయణరావును కోరారు. దివ్యాంగుల సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చినట్లు దివ్యాంగులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐకేపీ జిల్లా ఐబీ మమత, వీహెచ్‌పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు బాలరాజు, మండల అధ్యక్షులు సలీం, నాయకులు రమేశ్ తదితరులున్నారు.

## ఒకే వ్యక్తికి మూడు ప్రభుత్వ ఉద్యోగాలు



నియామక పత్రాన్ని అందుకుంటున్న శ్రీనివాస్‌రెడ్డి

శంకర్‌పల్లి, మార్చి 1: ఒకటి, రెండు, మూడు ఇవేమి కార్పొరేట్ విద్యా సంస్థలు ఇచ్చే ర్యాంకింగ్‌లు కావు. అంతకన్నా విలువైన ప్రభుత్వ రంగంలో సాధించిన ఉద్యోగాలు. పట్టుదల, నిరంతర కృషి ఉంటే ఏదైనా సాధించవచ్చనడానికి ఉదాహరణ. శంకర్‌పల్లి మండలం రావులపల్లి కలాన్ గ్రామానికి చెందిన కౌకుంట్ల శ్రీనివాస్‌రెడ్డి ఒకేసారి మూడు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. ఇటీవలే విడుదలైన గురుకుల నియామాక ఫలితాల్లో జేఎల్, టీజీటీ, పీజీటీ ఉద్యోగాలకు ఒకేసారి ఎంపికయ్యాడు. శ్రీనివాస్‌రెడ్డి రావులపల్లి గ్రామంలో ప్రాథమిక విద్య, ఇంటర్, డిగ్రీలను వికారాబాద్‌లో పూర్తి చేశాడు. పీజీ మ్యాథ్స్ ఉస్మానియా యూనివర్సిటీలో పూర్తి చేశాడు. తల్లిదండ్రులు భారతమ్మ, గోపాల్‌రెడ్డి రైతులు. చిన్నప్పటి నుంచి తల్లిదండ్రులు పడుతున్న కష్టాలు చూసి ఎలాగైనా ఉన్నతమైన ఉద్యోగాన్ని సాధించాలని పట్టుదలతో శ్రమించి ఉద్యోగాన్ని సాధించాడు. తన విజయానికి కారణమైన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, మిత్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మూడు ఉద్యోగాల్లో జూనియర్ లెక్చరర్ ఉద్యోగాన్ని ఎంపిక చేసుకుని నియామక పత్రాన్ని అందుకున్నాడు.

## పేకాట శిబిరంపై పోలీసుల దాడులు

మొయినాబాద్, మార్చి 1 : పేకాట ఆడుతున్న శిబిరంపై ఎస్‌ఓటీ పోలీసులు దాడులు చేసి పలువురిని అరెస్టు చేసిన ఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం హిమాయత్‌నగర్ గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ షాబాద్ శ్యాంరావు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ రాజుగౌడ్, ముదిగొండ మహేందర్‌యాదవ్, కే నగేశ్, బి మల్లేష్‌లు గురువారం రాత్రి గ్రామానికి సమీపంలోని గండిపేట జలాశయం ఒడ్డున ఇటుక బట్టీల వద్ద పేకాట ఆడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు వెంటనే రాజేంద్రనగర్ ఎస్‌ఓటీ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పేకాట ఆడుతుండగా వారిని పట్టుకున్నారు. వారి నుంచి రూ.34,330లు స్వాధీనం చేసుకుని వారిని అరెస్టు చేసి మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఎస్‌వోటీ పోలీసులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయడం జరిగింది.

## ఆలయ నిర్మాణానికి విరాళం




చెక్కులు అందజేస్తున్న దాతలు

చేవెళ్లరూరల్, మార్చి 1 : ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి దాతల సహకారం అభినందనీయమని ఆలూర్ ఎంపీటీసీ గోపులారం యాదమ్మపోచయ్య అన్నారు. చేవెళ్ల మండల పరిధిలోని ఆలూరు అనుబంధ గ్రామం వెంకన్నగూడలో నిర్మిస్తున్న ఆంజనేయస్వామి దేవాలయం నిర్మాణానికి శుక్రవారం ఎంపీటీసీ గోపులారం యాదమ్మపోచయ్య రూ.5,00500, ఆలూర్ మాజీ సర్పంచ్ విజయలక్ష్మీనర్సింహులు రూ.5 లక్షలు విరాళంగా అందజేశారు. అదేవిధంగా ఆలూర్ మాజీ ఉప సర్పంచ్, కురుమ సంఘం మండలాధ్యక్షుడు కసిరె వెంకటేశ్ యాదవ్ రూ.51వేలు, గ్రామస్తులు యాదిరెడ్డి రూ.51వేలు, అంతరాములు రూ.25 వేలు, నవీన్‌గౌడ్ రూ.21 వేలు, విఠల్‌రెడ్డి రూ.21 వేల చెక్కులను విరాళంగా గ్రామానికి చెందిన నాయకుడు కొండన్నోల రాంరెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు గోపులారం అశోక్, నాయకులు వెంకటేశ్, రాములుగౌడ్, జంగన్న, వెంకటేశ్, వెంకటయ్య, నర్సింహులు, పరిగి నర్సింహులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఎన్నికలపై అవగాహన అవసరం

కొత్తూరు, మార్చి 1: విద్యార్థులు ఎన్నికలపై అవగాహన కలిగి ఉండాలని కొత్తూరు జడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయుడు అంగూర్‌నాయక్ అన్నారు. కొత్తూరు జడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు శుక్రవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. ఇందులో పోటీపడిన విద్యార్థులకు తోటి విద్యార్థులు ఓట్లు వారి అభ్యర్థిత్వాన్ని బలపర్చారు. ఎక్కువ ఓట్లు వచ్చిన విద్యార్థిని పాఠశాల అధ్యక్షుడిగా, ద్వితీయ స్థానంలో ఓట్లు సంపాదించిన విద్యార్థిని సెక్రటరీగా ఎన్నుకున్నారు. మొత్తం 262 మంది విద్యార్థులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయుడు భానుప్రకాశ్, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




మాక్ పోలింగ్‌ను పరిశీలిస్తున్న ప్రధానోపాధ్యాయుడు